క్లుప్తంగా

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు



లక్ష్మీ గణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా లక్ష్మీగణపతి హోమం జరిపించారు. శుక్రవారం ఆలయంలో భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో 15 మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు అరట్లకట్టలో గుడాల గోపి ప్రచారం

పాలకొల్లు అర్బన్: మండలంలోని అరట్లకట్టలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శనివారం ఉదయం 8గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మద్దిరావమ్మ, గంగానమ్మ సంబరాలు ప్రారంభం



మాదివాడలోని మద్దిరావమ్మ, గంగానమ్మ సంబరాల్లో పాల్గొన్న పీవీఎల్

ఆకివీడు: మాదివాడలో వేంచేసియున్న మద్దిరావమ్మ, గంగానమ్మ సంబరాలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉండి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గ్రామ దేవతలుగా వెలుగొందుతున్న మద్దిరావమ్మ, గంగానమ్మ సంబరాలకు వందల ఏళ్ల చరిత్ర ఉందన్నారు. తరతరాలుగా ఈ ప్రాంత ప్రజలు ప్రతి ఏటా మద్దిరావమ్మ సంబరాలు, నాలుగేళ్లకొకసారి జాతర, జూన్ 1వ తేదీన ఆలయ పునర్నిర్మాణ వార్షికోత్సవాల్ని అంగరంగ వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి ఆలయ పునరుద్ధరణతో మాదివాడ అభివృద్ధి రూపురేఖలు మారిపోయాయన్నారు. మాదివాడలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ముగ్గురు గెలుపొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధి మాసాబత్తుల రాఘవులు, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, అంబటి రమేష్ పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు ముందే వచ్చిన మామిడి



సీసలి వద్ద రాష్ట్రీయ రహదారి ప్రక్కన మామిడి పండ్లు అమ్ముతున్న దృశ్యం

కాళ్ల: మామిడి పండ్లు ఈ ఏడాది సీజన్ కంటే ముందే వచ్చేశాయి. సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో మామిడి పండ్ల సీజన్ మొదలవుతుంది. కానీ మార్చిలోనే మామిడి పండ్లు మార్కెట్‌కు రాగా, ధరలు వినియోగదారులకు చుక్కలు చూపుతున్నాయి. కాళ్ల మండలం సీసలి గ్రామం వద్ద రాష్ట్రీయ రహదారిని ఆనుకుని మామిడి పండ్ల దుకాణం వెలిసింది. చెరుకు రసాలు, నూజివీడు చిన్నరసాల రకాలు ఇక్కడ విక్రయిస్తున్నారు. చెరుకు రసాలు రకం పరక రూ.400 నుంచి రూ.500 వరకు, నూజివీడు చిన్నరసాలు రూ.500 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. నూజివీడు తోటల్లోనుంచి మామిడి పండ్లను దిగుమతి చేసుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. సీజన్ ప్రారంభంలో అధిక రేట్లకు సరుకు కొనాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు.

మావుళ్లమ్మ శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక శ్రీ మావుళ్లమ్మ వారి సన్నిధిలో జరుగుతున్న శాశ్వత నిత్యాన్నదానానికి శుక్రవారం చినఅమిరం చెందిన కె. వెంకట సుబ్బరాజు శ్రీ దేవి దంపతులు రూ.1,11,116 విరాళంగా అందించారు. ముందుగా దాతలతో ఆలయ అర్చకులు కొప్పేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం ,అమ్మవారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో బుద్ధా మహాలక్ష్మి నగేష్, బాబురావు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి



వేములదీవి ఈస్ట్‌లో ప్రచారం చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



తండ్రి ప్రసాదరాజుకు మద్దతుగా వేములదీవి ఈస్ట్‌లో ప్రచారం చేస్తున్న శ్రీకృష్ణంరాజు

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఓటర్లను విజ్ఞప్తి చేశారు. మండలంలోని వేములదీవి ఈస్ట్ గ్రామంలో శుక్రవారం వేకువజాము నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ జగనన్నే మనకు మరోసారి ముఖ్యమంత్రి కావాలని, సంక్షేమం అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని అన్నారు. ప్రతి ఓటరూ ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు.

తండ్రి గెలుపు కోరుతూ తనయుడు

తండ్రి ముదునూరి ప్రసాదరాజుకు ఓటు వేయాలని కోరుతూ ఇంటింటికీ తిరుగుతూ ఆయన తనయుడు ముదునూరి శ్రీకృష్ణంరాజు ప్రచారం చేస్తున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి నాన్నను గెలిపించండి అంటూ వినూత్నంగా ఆయన చేస్తున్న ప్రచారం అందరినీ ఆకట్టుకుంటుంది. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, బాపూజీ, వేములదీవి, బియ్యపుతిప్ప గ్రామాల సర్పంచ్‌లు తిరుమాని శ్రీను, సంగాని మోహనరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, సంగాని రాంబాబు, తిరుమాని అర్జునరావు, నేతల నాగేశ్వరరావు, తిరుమాని భూచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



విలేకరులతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలో వెనుకబడిన కులాల వారికి సామాజికంగా గుర్తింపునిచ్చి రాజకీయ పదవులు కట్టబెట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ అమలు చేసిన సంస్కరణలతో బీసీలకు సామాజిక న్యాయం, రాజ్యాధికారం, ఆత్మగౌరవం గత 5 ఏళ్లలో దక్కిందన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు 11 పార్లమెంట్ స్థానాలు, 48 అసెంబ్లీ స్థానాలు ఇచ్చి బీసీ సామాజిక వర్గానికి సీఎం జగన్ పెద్ద పీట వేశారని అభినందించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తుండగా టీడీపీ ఎమ్మెల్సీ బాబూ రాజేంద్రప్రసాద్ కోర్టులో కేసు వేయడం వల్ల స్థానిక సంస్థల్లో 23 శాతం కుదించారన్నారు. దీని వల్ల బీసీలు రాజకీయంగా పదవులు దక్కకుండా అన్యాయం చేశారన్నారు. బీసీల మీద ప్రేమ చూపిస్తున్నట్లు నటిస్తున్న చంద్రబాబు తన పార్టీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ కోర్టుకు వెళ్లకుండా ఎందుకు ఆపలేకపోయారని నిలదీశారు. సీఎం జగన్ బీసీ కులగణన చేయడానికి అసెంబ్లీలో తీర్మానం చేస్తే ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించాయని వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు అన్యాయం జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే నిమ్మల ఎందుకు అడ్డుకోలేకపోయారని వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. బీసీలకు అత్యధికంగా ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించిన వైఎస్సార్ సీపీకి బీసీలు అండగా నిలవాలని ఆయన కోరారు. రానున్న ఎన్నికల్లో నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాల, పాలకొల్లు ఎమ్మెల్యేగా గుడాల గోపిలకు బీసీలంతా ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కడలి శ్రీప్రసాద్, గానుబోయిన దుర్గారావు, బొక్కా గంగాధరరావు, ధనకొండ సత్యనారాయణ, కాండ్రేకుల సత్యనారాయణ, కవురు మధు, గుబ్బల వెంకట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు చూసి ఓటెయ్యాలి



చింతదిబ్బలో పర్యటిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)



మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు

యలమంచిలి: ప్రభుత్వ పథకాలన్నీ మీకు పూర్తి స్థాయిలో అందాయని భావిస్తే ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని కోరుతూ వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చింతదిబ్బ, సీతమ్మ చెరువు గ్రామాలలో ఆయన ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న చేసిన మేలును వివరించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తొలగి అన్ని కులాల వారికి రాజ్యాధికారం కావాలంటే ఎమ్మెల్యేగా తనకు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కులమతాలకు అతీతంగా నీతి వంతమైన పాలన కావాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు, సర్పంచ్ చిలుకూరి సూనావతి, ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెల్లుబోయిన శివకృష్ణ, బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్ పార్టీ నాయకులు చిలువూరి కుమార దత్తాత్రేయ వర్మ, బోనం బులివెంకన్న, వినుకొండ రవి, వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభ సాయి వెంకట నరసింహారావు, పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నర్సయ్య, డైరెక్టర్లు గుర్రాల వెంకట్రావు, కల్యాణం గంగాధరరావు, పెద గోపురం చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దానమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ



ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన దానమ్మ ఆలయం



దానమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

పెనుమంట్ర: మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామంలో నూతనంగా నిర్మించిన దానమ్మ వారి ఆలయ విగ్రహ పునః ప్రతిష్ఠా కార్యక్రమం గ్రామానికి చెందిన ప్రముఖ దాత వెలగల నవభారత్ రెడ్డి,వాణి దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి వైదిక కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి గూడూరి ఉమాబాల, మండప ప్రదిక్షణ చేసి దానమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ప్రధాన దాత వెలగల శివాజీరెడ్డి దంపతులు, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి దంపతులు, సర్పంచ్ వనుం సూర్యనారాయణ, ఉపసర్పంచ్ గొలుగూరి నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి సూర్యభాస్కరరెడ్డి, కొవ్వూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దింట్లమ్మ ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం



పెనుగొండ మల్లప్ప దిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయం

పెనుగొండ: స్థానిక మల్లప్పదిబ్బలోని పెద్దింట్లమ్మ ఆలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం శనివారం నిర్వహించనున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని పురాతన పెద్దింట్ల మ్మ ఆలయం రహదారి విస్తరణతో ఆలయం రోడ్డు దిగువకు ఉండడంతో ఇబ్బందులు పడేవారు. వర్షం పడితే చాలు వర్షపు నీరు అంతా ఆలయంలోకి చేరుకునేది. దీంతో ఎన్నో ఏళ్లుగా నూతన ఆలయ నిర్మాణానికి విజ్ఞప్తి చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. సమస్యను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో ప్రభుత్వం నుంచి రూ.80 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో నిర్మాణం పూర్తి చేశారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేశారు. ప్రభుత్వ నిధులకు తోడు, దాతల సహకారం తోడు కావడంతో ఆలయాన్ని పూర్తి హంగులతో తీర్చిదిద్దారు. ఆలయాభివృద్ధికి కృషి చేసిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు పలువురు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామాల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



నరసాపురం రూరల్: మర్రితిప్పలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పాలకొల్లు అర్బన్: యాళ్లవానిగరువులో శిలువతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు పాలపర్తివారిపేటలోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఫాదర్ గోడి యేసేబ్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కరుణ, ప్రేమ, తాగ్య నిరతి ఉండాలని కోరారు. కార్యక్రమంలో మైలాబత్తుల శామ్యూల్ జాన్, పాలపర్తి జయరాజు, ఎం.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో...

నరసాపురం రూరల్: మండలంలోని సరిపల్లి, మల్లవరం, రాజుల్లంక, కె.బేతపూడి, మర్రితిప్ప గ్రామాల్లో లూథరన్, ఆర్‌సీఎం, జీసెస్ గాస్పెల్ చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రీస్తు బోధనలను వివరించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. యాళ్లవానిగరువు ఆర్‌సీఎం చర్చి పరిధిలోని 15 గ్రామాల విశ్వాసులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రెవరెండ్ యాదాల కిషోర్ శిలువ మోశారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ విజయ్‌కుమార్, బ్రదర్ అనిల్, పూలపల్లి సెయింట్ జాన్స్ హాస్పటల్ సిస్టర్ డా.జ్యోతి, సెయింట్ మేరీ స్కూల్ సిస్టర్ లెబిన్ తదితరులు పాల్గొన్నారు.

గరువురజకపేట రోడ్డుకు మోక్షం



గరువు రజకపేటకు రూ. 28లక్షలతో నిర్మించిన గోస్తనీ గట్టు సీసీ రోడ్డు

పెనుమంట్ర: మండలంలోని గరువు, రజకపేట రోడ్డుకు మోక్షం కలిగింది. గరువు గ్రామ పంచాయతీ పరిధిలోని సాంబయ్య చెరువుగట్టు ప్రాంతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అయితే ఈ కాలనీలలో ప్రధాన రోడ్లుగా ఉన్న గోస్తనీ నది గట్టు రోడ్డు నిర్మాణ విషయంలో ఆ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో 25 ఏళ్లుగా గరువు, రజకపేట రోడ్డు అధ్వానంగా మారింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ కాలనీ వాసులు తమ సమస్యలను స్థానిక శాసన సభ్యుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి ప్రభుత్వ నిధులు రూ.40 లక్షలు మంజూరు చేయించారు. అయితే రూ.20 లక్షలు గరువురజకపేట రోడ్డుకు, రూ.20 లక్షలు జగనన్న కాలనీ రోడ్లకు కేటాయించడంతో ఈ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గరువు రజకపేట రోడ్డుకు అదనంగా రూ. 8లక్షలు పంచాయతీ నిధులు వెచ్చింది. దీంతో రూ. 28 లక్షలతో గరువు రజకపేటకు 600 మీటర్లు సీసీ రోడ్డు నిర్మించి రోడ్డు పనులను పూర్తి చేశారు. జగనన్న కాలనీలో కూడా రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

ఆచంటలో వేగంగా ఆలయాల అభివృద్ధి



పెనుగొండలో రూ.1.50 కోట్లతో నిర్మించిన వాసవీ నివాస్ సత్రం

పెనుగొండ: సంక్షేమ పాలనతో పాటు, గ్రామాల్లో అభివృద్ధి పరవళ్లకు తోడు గతంలో ఎన్నడూ లేని విధంగా ఆచంట నియోజకవర్గంలో ఆధ్యాత్మిక అభివృద్ధితో ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. గత ప్రభుత్వాల్లో కేవలం పుష్కరాల సమయంలో మాత్రమే ఆలయాలకు రంగులద్ది అభివృద్ధి అంటూ ఊరూవాడా హోరెత్తించేవారు. కానీ ప్రస్తుతం ఆ సాంప్రదాయానికి భిన్నంగా ఆచంట నియోజక వర్గంలో ఆలయాలు అభివృద్ధి చెందాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటకు తోడుగా, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సైతం ప్రత్యేక దృష్టి సారించడంతో గ్రామాల్లో ఆలయాలు కళకళలాడుతున్నాయి.

నిర్మాణాలు ఇలా

ఆర్యవైశ్యులు ఇలవేల్పు వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో గత ప్రభుత్వంలో వాసవీ నివాస్ సత్రాన్ని కూల్చివేసి భక్తులకు అసౌకర్యం కలిగినా కనీస నిధులు విదల్చకపోవడంతో వాసవీ నివాస్ సత్రం కలగానే మిగిలిపోయింది. వైఎస్సార్ సీపీ పాలనలో రూ.1.50 కోట్లుతో వాసవీ నివాస్ సత్ర నిర్మాణం ప్రారంభించి పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. దీంతో నిత్యాన్నదానానికి ఇబ్బందులు తొలగడంతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు వసతి సదుపాయం కల్పించారు. దీంతో పాటు మల్లప్ప దిబ్బలో శిథిలావస్థకు చేరిన రూ.80 లక్షలతో పెద్దింట్లమ్మ ఆలయాభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఆలయ నిర్మాణం పూర్తయి శనివారం ప్రతిష్ఠాపన చేయనున్నారు. వడలిలో గ్రామదేవత మందాలమ్మ ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.35 లక్షలు మంజూరు చేసింది. దీంతో పాటు వడలిలో ప్రసిద్ధి అగస్త్యేశ్వర స్వామి ఆలయాభివృద్ధికి రూ.1.50 కోట్లు నిధులు అందించి నిర్మాణాలు వేగంగా నిర్వహిస్తున్నారు. ఇవే గాకుండా పురాతన ఆలయాలభివృద్ధికి కరుగోరుమిల్లి, తూర్పుపాలెం, జగన్నాథపురం, ఆలమూరు, పండిత విల్లూరు, వెంకట్రామపురం, దొంగరావిపాలెం, చినమల్లం, కొఠాలపర్రు, ములపర్రులకు రూ.10 లక్షల వంతున నిధులు మంజూరు చేయడంతో నిర్మాణాలు ఊపందుకున్నాయి,. గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు సమకూర్చిన మాజీ మంత్రి , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు ఆయా గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఆధ్యాత్మిక శోభ



గతంలో ఏ ప్రభుత్వంలోనూ లేని అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతుంది. ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడానికి మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు కృషి మరువలేనిది. దీంతో నియోజకవర్గంలో ఆధ్యాత్మిక శోభ విరాజిల్లుతుంది.

– గుబ్బల వీర బ్రహ్మం, తూర్పుపాలెం

వైఎస్సార్ సీపీలో చేరికలు



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న కవిటం శెట్టి బలిజ సంఘ నాయకులు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గం తూర్పుపాలెంలో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో కుక్కల సూరిబాబు ఆధ్వర్యంలో సుమారు 100 శెట్టి బలిజ సంఘ నాయకులు పార్టీలో చేరారు. శుక్రవారం వారిని శ్రీరంగనాథరాజు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కవిటం లాకుల వద్ద శెట్టి బలిజ కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాస రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పడాల సత్యనారాయణ రెడ్డి(అబ్బు), విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు సత్తి మురళీకృష్ణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బొక్కా సత్యనారాయణ, కేతా నాగరాజు, బి సుబ్రహ్మణ్యం, కేతా రామయ్య, కండిబోయిన నాగరాజు, జేపీ మాధవరావు, కేతా నాని, కడలి శివన్నారాయణ, బాలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



చెరుకువాడలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఉండి: శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలంతా సహకరించాలని ఎస్సై ఎం.లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెరుకువాడలో కేంద్ర బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఎస్సై మాట్లాడుతూ మండలంలో సమస్యాత్మక గ్రామాల్లో, అవసరమైన ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల సంఘం కృషి చేస్తుందన్నారు. దీనికి తోడు ప్రజలంతా తమ సహకారం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఉండేలా భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. రాజకీయ పార్టీలు, ప్రజలు స్వచ్ఛందంగా ఎన్నికల నిర్వహణకు తోడ్పడాలన్నారు. ఎన్నికల సమయంలో ఏ విధమైన కేసులు నమోదైనా వాటిని ఎలక్షన్ కేసులగానే పరిగణిస్తామన్నారు. దీనివల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రజలు అనవసర విషయాల జోలికి పోకుండా శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఎస్సై అన్నారు. ముఖ్యంగా ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సమస్యలనైనా సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేశారు.